క్లుప్తంగా

సింహగిరిపై శరన్నవరాత్రి మహోత్సవాలు



చతుర్భుజ తాయారుకు హారతి అందజేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ బేడామండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దసరా శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో దసరా శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వి. శిరీష కోరారు. డ్రాయింగ్,క్రాఫ్ట్, పెయింటింగ్ వంటి పోటీలు నిర్వహించారు. ఇవే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు.

శారదాపీఠాన్ని సందర్శించిన శ్రీవత్సవ్



స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర ఆశీస్సులు తీసుకుంటున్న శ్రీవత్సవ్

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆదివారం సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



జోడుగుళ్లపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహం..

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం వద్ద మృతదేహం కొట్టుకొచ్చినట్టు స్థానికులు ద్వారా ఆరిలోవ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ప్యాంట్, షర్టు జేబుల్లో వివరాలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించ లేదు. మృతుడి వయసు 30–35 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడుకి సంబంధించిన బంధువులు ఎవరైనా పోలీసులను సంప్రదించాలని సీఐ సోమశేఖర్ తెలిపారు.

తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

గాజువాక: తూర్పు కాపులందరికీ ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు డిమాండ్ చేశారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన తూర్పు కాపు ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1972 తరువాత విశాఖ జిల్లాలో జన్మించిన తూర్పు కాపులకు బీసీ డీ, ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు ఏడాది క్రితమే సర్క్యులర్ జారీ చేయించామన్నారు. ఈ సర్క్యులర్‌ను ఏ తహసీల్దారైనా అమలు చేయకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.



పరవాడలో దుర్గాదేవిని దర్శించుకొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి తదితరులు



వెన్నలపాలెంలో వెలసిన దుర్గాదేవి

చల్లని తల్లి.. ప్రణమిల్లి

- శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాల్లో పూజలు అందుకున్న అమ్మవారు
- కాలనీల్లో వెలసిన ప్రత్యేక మండపాలు



సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయంలో ..



చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువుదీరిన పంముఖి గాయత్రీదేవి

పరవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కలశ స్థాపన పూజ శాస్త్రోక్తంగా అర్చకులు జరిపించారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పరవాడలో బొంకుల దిబ్బ యూత్, యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ చుక్క రామునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉప సర్పంచ్ బండారు రామారావు, పైల హరీష్ పాల్గొన్నారు.

◆ తానాం గ్రామంలో ఆదర్శ మోటార్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, ఉప సర్పంచ్ వర్రి వసంతరావు, ఆదర్శ మోటార్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పరమేష్, అమ్మవారిని దర్శించుకున్నారు.

◆ వెన్నలపాలెంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దుర్గమాంబ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమాంబ అమ్మవారిని సర్పంచ్ వెన్నల అప్పారావు, ఎంపీటీసీ అరుణకుమారి, మాజీ సర్పంచ్ బండారు రామస్వామినాయుడు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, జూనియర్ అప్పలనాయుడు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

◆ వెన్నలపాలెంలో హనుమాన్‌యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.

శరణు..శరణు.. దుర్గమ్మ

సింహాచలం: సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. బాలాత్రిపురసుందరిదేవి ప్రాంగణంలో అర్చకులు కుంకుమపూజలు నిర్వహించారు.

◆ అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ మండపం ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

◆ చినముషిడివాడలోని విశాఖ శ్రీశారదాపీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు వినాయకపూజతో పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి శ్రీకారం చుట్టారు. తొలిరోజు రాజశ్యామల అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి నిజరూపానికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అభిషేకం చేశారు. అలాగే పీఠం ప్రాంగణంలో చండీ హోమం, రాజశ్యామల హోమం పండితులు నిర్వహించారు. రాజశ్యామల సమేత చంద్రమౌళీశ్వర పీఠార్చనను ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

◆ అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ తల్లి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. సింహాచలం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, ప్రహ్లాదపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

◆ అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవికి అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ కుంకుమపూజ నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు చేశారు.



శారదాపీఠంలో బాలత్రిపుర సుందరిదేవిగా రాజశ్యామల

◆ చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లోని పంచముఖి గాయత్రీ ఆలయంలో అమ్మవారిని మహాగాయత్రీదేవిగా అలంకరించారు. వినాయకపూజ, పుణ్యాహవచనం, కలశపూజ, గోపూజ చేశారు. సాయంత్రం భజన, సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు.

◆ రాంపురంలోని మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి విశేషంగా కుంకుమపూజలు నిర్వహించారు. ఉత్తర పీఠాధిపతి మహాశక్తిదేవి ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాలత్రిపురసుందరిదేవి పూజ, 21న సామూహిక సువాసిని అర్చన, 22న చండీ హోమం , 23న నవమి ఉత్సవం, 24న చక్రస్నానం, పూర్ణాహుతి, 25న వేంకటేశ్వర కల్యాణం నిర్వహించనున్నట్టు పీఠం ప్రతినిధులు తెలిపారు.

◆ నాయుడుతోటలోని వేదగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రాపర్తి కన్నా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో ఆదివారం దసరా బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. ఆహుతులైన భక్తులు,గురూజీ శిష్యులు కలిసి 28 కలశాలను చండీ దేవతకు స్థాపించి ప్రాణ ప్రతిష్ట గావించారు. మూల విరాట్ అమ్మవారు కాళీ మాత రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం కాకినాడ నుంచి వచ్చిన జ్యోతి ఆధ్వర్యంలో ఈశ ఫైన్ ఆర్ట్స్‌కు చెందిన 12 మంది పిల్లలతో కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు.

◆ మండలంలోని నంగినారపాడు,అసకపల్లి శివారు గవరవాని కొంపలు,సబ్బవరం తదితర గ్రామాల్లో భారీ మండపాలు ఏర్పాటు చేసి దుర్గా మాత అమ్మవారిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భర్నికాన బాబూరావు,కాపుశెట్టి శేషుబాబు,గవర అప్పారావు,సత్యనారాయణ,కర్రి అప్పారావు,నర్సంగరరావు,కనకరాజు తదితరులు పాల్గొన్నారు. నంగినారపాడులో గ్రామ పెద్దలు ఎర్ని బాబు,నారపిన్ని అప్పలరాజు, శ్రీధర్ పూజలు చేశారు.



తానాంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని దర్శించుకున్న భక్తులు



అడవివరంలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సింహగిరి పునరావసుల లేఅవుట్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

ప్రకృతి సాగుతో మంచి దిగుబడులు



ఆదిరెడ్డిపాలెంలో ఉద్యాన సాగును పరిశీలిస్తున్న డీపీఎం లచ్చన్న తదితరులు

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆరోగ్యవంతమైన పంటల దిగుబడితో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి సాగు డీపీఎం లచ్చన్న తెలిపారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం,బంగారమ్మపాలెం గ్రామాల్లో ఆధునిక విధానంలో చేపట్టిన ప్రకృతి సాగు మోడల్ ప్లాట్లను ఆయన ఆర్‌టీఎల్ ప్రకాష్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఏటీఎం పద్ధతిలో కూరగాయలు, ఆకు కూరలు,దుంప జాతి,తీగ జాతి మొదలైన విత్తనాలను 20 సెంట్లలో బెడ్స్(చిన్న చిన్న మళ్లు)లో వేసుకుని సాగు చేస్తే రైతులకు నిరంతరాయంగా ఆదాయం వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు జిల్లేడు కషాయం, ఘన జీవామృతం తయారు చేయడంపై అవగాహన కల్పించారు. సాగు విధానంపై పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో రైతులు ఆదిరెడ్డి రమణ, ఆదారి రాము,సిబ్బంది వెంకటలక్ష్మి,కె. పద్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో విషాదం



నక్క కనకరాజు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- కనకరాజు భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- భారీగా తరలివచ్చిన అభిమానులు
- నేడు అంత్యక్రియలు

సింహాచలం:వైఎస్సార్ సీపీ పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు మృతి చెందడంతో అతని స్వగ్రామం అక్కిరెడ్డిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కనకరాజు మృతి వార్త విన్న ఆయన అభిమానులు, సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. కనకరాజు ఇటీవలే రెండోసారి వైఎస్సార్‌సీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ముఖ్య అనుచరుడిగా ఎదిగారు. పిలిస్తే పలికే నేతగా కనకరాజు మన్ననలు పొందారు. కనకరాజు పార్థివదేహానికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవిసాంబ, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు కనకరాజుకు నివాళులర్పించారు. కనకరాజుకు భార్య మణి, ఇద్దరు కుమారులు బాలమురళి, తరుణ్ ఉన్నారు. పెద్దకుమారుడు బాలమురళికి వివాహం అయింది. సోమవారం కనకరాజు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమా దంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. ఈ కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక వర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

ఉక్కునగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సిటు నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేలా కార్మిక వర్గంపై దాడి చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధానం అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలు యజమానులకు అనుకూలంగా మార్చడం వంటి చర్యలకు పూనుకోవడం అన్యాయమన్నారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా ఉన్నవి తగ్గించడం, ఉపాధి రక్షణ లేకుండా చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, ఆర్.శంకరరావు, కాకి సురేష్, సత్యనారాయణ, కె.ఎం.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరుపుతున్న అనకాపల్లి జేసీ జాహ్నవి



హెలీప్యాడ్ వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



ఫార్మాసిటీలో వెలసిన స్వాగత ద్వారాలు

- సమీక్షించిన జేసీ జాహ్నవి

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేశారు.జేఎన్ ఫార్మాసిటీలో అరబిందో యాజమాన్యం సుమారు రూ.750 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పరిశ్రమను సోమవారం సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలడానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు భద్రతపరమైన ఏర్పాట్లను పోలీసు అధికారులతో కలిసి అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి సమీక్షించారు.

వెలసిన ఫ్లెక్సీలు

హెలీప్యాడ్ నుంచి ఔషధ పరిశ్రమ ప్రధాన గేటు వరకు సీఎం వైఎస్ జగన్ ఫొటోతో పాటు ఎమ్మెల్యే అదీప్‌రాజ్, రాష్ట్ర నేతలు, మంత్రులు ఫొటోలతో రోడ్డుకిరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకొని ఫార్మాసిటీలో సీఎం సెక్యూరిటీతో కలుపుకొని 450 మంది పోలీసులను మోహరించారు. హెలీప్యాడ్ వద్ద ప్రత్యేక డ్యాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో భవిష్యత్తు అంధకారం



976వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్ 1గా నిలిచిందని, అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 976వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరంలో సంస్థలోని పలు విభాగాల కార్మికులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ఇప్పటికే పన్నుల రూపంలో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలను అందించిందని, ఎంతో మందికి ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వృద్ధుల భద్రత, సంక్షేమానికి కృషి

అగనంపూడి: బలహీన వర్గాలకు చెందిన వృద్ధుల భద్రత, సంక్షేమం కోసం హెల్ప్ ఏజ్ ఇండియా నిరంతరం కృషి చేస్తోందని సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గుజ్జు మణిదీప్ తెలిపారు. అగనంపూడిలో ఆదివారం నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల జీవితాల్లో నాణ్యతను మెరుగుపర్చడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వృద్ధులకు తాము అందజేసే గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని, ప్రతి ఒక్కరూ ఈ కార్డును పొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, గుదే సుశీల గజేంద్రరావు, ఏవీఎస్ఎం అప్పారావు, బెల్లాల నాగేశ్వరరావు, రఫీ, విందుల వరహాలు, కొలిపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.